క్లుప్తంగా

నేడు విస్తృతస్థాయి సమావేశం

యాలాల: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు సంగెం నర్సిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దేముల్ మండలంలోని కందెనెల్లి జీపీఆర్ గార్డెన్‌లో ఉ.11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొంటారని పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి ఓంకారేశ్వర స్వామి ఉత్సవాలు



మందిపల్‌లో కొలువైన ఓంకారేశ్వర స్వామి

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామంలోని ఓంకారేశ్వర స్వామి ఆలయంలో నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతీ సంవత్సరం మహాశివరాత్రిని పురస్కరించుకుని మూడు రోజుల పాటుగా ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు మఠం రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం ఆలయ ప్రవేశం, అఖండ దీపారాధన, గంగా సేకరణ, గణపతి, గౌరీపూజ తదితర పూజా కార్యక్రమాలతో ఉత్సవాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు తరలిరావాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రమేశ్



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

బంట్వారం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని సీనియర్ కాంగ్రెస్ నాయకులు రమేశ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని యాచారంలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఎమ్మెల్యే , స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. యాచారం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

వికారాబాద్ అర్బన్: జీపీ కార్యాలయాల్లో పని చేసే కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ. 26000 వేలు ఇవ్వాలని, ప్రతి కార్మికుడికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కాంట్రాక్టు పద్ధతిని పూర్తిగా రద్దు చేయాలని అన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు రామకృష్ణ, చంద్రయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య, కుమార్ పాల్గొన్నారు.

కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలి

సీఐ శ్రీనివాస్



కంప్యూటర్లను అందజేస్తున్న సీఐ శ్రీనివాస్

పరిగి: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని పరిగి సీఐ శ్రీనివాస్ అన్నారు. సాఫ్ట్‌లైన్ కంప్యూటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్యాలెంట్ టెస్టులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ట్యాలెంట్ టెస్టులతో విద్యార్థుల్లోని ప్రతిభ వెలికితీయవచ్చన్నారు. బాగా చదివితేనే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థానంలో ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్, నిర్వాహకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు పర్మిషన్లు !

- తేదీలు మార్చి దర్జాగా ఇసుక అక్రమ రవాణా
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మండలవాసులు



కాగ్నా నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టరు

యాలాల: ప్రభుత్వ, ప్రైవేటు పనుల పేరుతో యాలాల రెవెన్యూ అధికారులు జారీ చేస్తున్న అనుమతుల వ్యవహారం చర్చకు దారి తీస్తుంది. ప్రతి రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లకు అడ్డగోలుగా ఇసుక అనుమతులు ఇస్తూ, అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు ఇసుక అనుమతి పత్రాల జారీలో వాహనాల యజమానుల నుంచి వేల రూపాయాలు దోచుకుంటున్నట్లు సమాచారం.

మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ సమీపంలోని కాకరవేణి నది నుంచి తాండూరు మండలం అంతారంలో సీసీ రోడ్డు నిర్మాణానికి 28 ట్రాక్టర్ల ఇసుకకు యాలాల తహసీల్దార్ మార్చి 4వ తేదీన 9 వాహనాలకు అనుమతి ఇచ్చారు. ఇందుకు వాహన యజమానులు రూ.16,800 డీడీ కట్టి ఇసుకను తీసుకుపోయారు. కాగా, ఇదే అనుమతి పత్రంపై బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్జాగా ఇసుక ట్రాక్టర్లు కాకరవేణి నదిని కొల్లగొట్టాయి. పాత తేదీ (మార్చి 4) కొట్టివేసి బుధవారం(మార్చి 6)గా మార్చి అడిగిన వారికి అనుమతి ఉందంటూ దర్జాగా ఇసుక తరలించుకుపోయారు. ఈ విషయంలో అటు రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలకు తావిస్తుందని మండలవాసులు పేర్కొంటున్నారు. తేదీ మార్పు చేయాల్సి వస్తే రెవెన్యూ అధికారులు కొత్తగా అనుమతి పత్రం జారీ చేస్తారు.. లేదా తేదీ సవరణ చేసిన పత్రంలో అధికారి సంతకంతో పాటు హోదా రాస్తారు. ఇవేవి ఆ పత్రంలో లేకపోవడం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తుంది.

ఒక్క ట్రాక్టరుకు రూ. 2వేలు!

యాలాల మండల పరిధిలోని దేవనూరు, నాగసముందర్, బెన్నూరు, విశ్వనాథ్‌పూర్, గోవిందరావుపేట పరిధిలోని కాకరవేణి, కాగ్నా నది నుంచి యాలాల రెవెన్యూ అధికారులు ఇసుక అనుమతులు ఇస్తున్నారు. అయితే ఇసుక అవసరమైన వారు ట్రాక్టరు(3 క్యూబిక్ మీటర్లు) ఇసుకకు రూ.600లు జిల్లా కలెక్టర్ పేరిట డీడీ చెల్లించాలి. కాని, అవసరమైన వారితో పాటు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారు వివిధ అభివృద్ధి పనుల ప్రొసీడింగ్ కాపీలతో ఇసుక కోసం యాలాల తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదిస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు ఇదే అదునుగా భావించి అందినకాడికి దోచుకుంటున్నారు. ఒక్క ట్రాక్టర్‌కు అనుమతి ఇవ్వాలంటే రూ.2 వేలు చెల్లించాలి. గతంలో ఇదంతా నేరుగా వసూలు చేసిన ఓ అధికారి, ప్రస్తుతం కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న ఒకరికి అప్పగించారు. వీఆర్ఏ అనుమతి పత్రాలు జారీ చేసిన తరువాత కార్యాలయం బయట ట్రాక్టర్ల యజమానుల నుంచి డబ్బులు వసూలు చేసి అనుమతి పత్రాలు ఇస్తున్నారు. ఇదంతా సదరు అధికారుల కనుసన్నల్లో జరుగుతున్నట్లు సమాచారం. ఈ విషయంలో జిల్లా అధికారులు దృష్టిసారించి ఇసుక అనుమతుల పేరిట జరుగుతున్న మోసాలకు చెక్ పెట్టాలని మండలవాసులు కోరుతున్నారు. ఈ విషయమై యాలాల తహసీల్దార్ మునీరొద్దీన్‌ను వివరణ కోరేందుకు పలుమార్లు ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



తేదీని మార్చిన అనుమతి పత్రం

మీటర్లు తీసుకుంటేనే ఉచిత కరెంటు

ఎంపీడీఓ నర్సింహులు



తరిగోపులలో పర్యటిస్తున్న ఎంపీడీఓ, ఏఈఈ

ధారూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఇంకా అక్రమ విద్యుత్ కనెక్షన్లు కనిపిస్తున్నాయని ధారూరు ఎంపీడీఓ నర్సింహులు అన్నారు. మండల పరిధిలోని తరిగోపుల గ్రామాన్ని బుధవారం ఎంపీఓ సురేష్, ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి తదితరులతో కలిసి సందర్శించారు. గ్రామంలోని ఓ కాలనీలో అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఉండటాన్ని ఆయన గమనించారు. ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను వాడుకునేందుకు వీలు కల్పించిందని, అక్రమ కనెక్షన్లకు బదులుగా విద్యుత్ మీటర్లు తీసుకొని లబ్ధిపొందాలని ప్రజలకు సూచించారు. గ్రామాల్లో ప్రజలు 100 యూనిట్ల కన్నా ఎక్కువ విద్యుత్ వాడరని, అక్రమ మార్గాన్ని వీడి మీటర్లు పెట్టుకుంటే సక్రమంగా, దర్జాగా వాడుకోవచ్చన్నారు. ఎవరెవరు అక్రమంగా విద్యుత్ వాడుతున్నారు, వారందరి ఇళ్లకు మీటర్లు అమర్చాలని ఆయన ట్రాన్స్‌కో ఏఈని ఆదేశించారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయంతో పాటు విద్యుత్‌ను సక్రమంగా వినియోగించుకునే వెసులుబాటు కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. అక్రమ విద్యుత్ వాడకం వల్ల సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఎంపీడీఓ వెంట ఎంపీటీసీ నర్సమ్మ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు పీఆర్టీయూ అండ



చెక్కును అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

కుల్కచర్ల: ఉపాధ్యాయులకు పీఆర్టీయూ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పీఆర్టీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ అన్నారు. కుల్కచర్ల మండలం కుస్మసముద్రం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు పోలినాయుడు అనారోగ్య కారణంగా మృతి చెందాడు. బుధవారం మండల కేంద్రంలో పీఆర్టీయూ కుల్కచర్ల మండల శాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబీకులకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే అనారోగ్య సమస్య కారణంగా పోలినాయుడు మృతి చెందడం బాధాకరమన్నారు. పీఆర్టీయూలో క్రియాశీలక సభ్యత్వం ఉన్న ఉపాధ్యాయులకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. బాధితుడు తల్లికి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కుల్కచర్ల మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్, కుల్కచర్ల మండల పీఆర్టీయూ అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి బస్వరాజు, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, సంఘ నాయకులు మారుతి, పరందాములు, తావుర్య, నర్సింలు గౌడ్, వెంకటయ్య, మహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



కార్యదర్శులకు సూచనలు చేస్తున్న రామకృష్ణ

కుల్కచర్ల: రోజురోజుకు ఎండలు ఎక్కువవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్య రాకుండా పంచాయతీ కార్యదర్శులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో సమయానుకూలంగా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడితే వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రజల నీటి సమస్యను ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ కరీం, మిషన్ భగీరథ డీఈ సుబ్రమణ్యం, జువాలజిస్ట్ భాగ్య పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా జాగ్రత్తలు

పరిగి: ఎండకాలం పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో, తండాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలన్నారు. నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ దయానంద్, అధికారులు పాల్గొన్నారు.

లక్ష కోట్ల దోపిడీకి కాంగ్రెస్ సిద్ధం



ఆర్డీఓకి వినతిపత్రం ఇస్తున్న రోహిత్‌రెడ్డి, నాయకులు

- నాడు ఎల్ఆర్ఎస్ ఉచితమని నేడు వసూళ్లకు పాల్పడుతోంది ..
- తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎల్ఆర్ఎస్ ఉచితమంటూ దొంగ మాటలు చెప్పిందని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఒక్కో దరఖాస్తు దారుడి నుంచి పెద్ద మొత్తంలో దోపిడీకి పాల్పడుతోందని విమర్శించారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష కోట్ల దోపిడీకి రంగం సిద్ధం చేసుకుందననారు. జిల్లాలో ఎల్ఆర్ఎస్ కోసం 23,279 దరఖాస్తులు వచ్చాయని, అందులో తాండూరు నుంచి 13వేల అర్జీలు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తు దారులంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారేనని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్ రాజుగౌడ్, పార్టీ మండలాల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీణా, కౌన్సిలర్లు శోభారాణి, సంగీతా ఠాకూర్, అనురాధ పాల్గొన్నారు.

ఉచితంగా ఎల్ఆర్ఎస్‌ను చేపట్టాలి

వికారాబాద్ అర్బన్: ఉచితంగా ఎల్ఆర్ఎస్ స్కీంను చేపట్టాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాకముందు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డబ్బులు వసూళ్లు చేసేందుకు సిద్ధమైందని మండిపడ్డారు. నిసరన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు రాంరెడ్డి, విజయ్ కుమార్, కౌన్సిలర్లు గోపాల్, నవీన్, కృష్ణ, రాజమల్లయ్య పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేయాలి

కొడంగల్: భూముల క్రమబద్ధీకరణ పథకాన్ని (ఎల్ఆర్ఎస్) ఉచితంగా అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ ద్వారా ప్రజలపై ఆర్థిక భారం మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. బుధవారం కొడంగల్‌లో నిర్వహించాల్సిన నిరసన కార్యక్రమం వాయిదా వేసినట్లు చెప్పారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ధర్నాను విరమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ ఎంపీపీ విజయకుమార్, కొడంగల్ రెండో వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌రావు యాదవ్ పాల్గొన్నారు.

ప్రజల సొమ్మును దోచుకుంటుంది..

పరిగి: ఎల్ఆర్ఎస్ ద్వారా ప్రజల సొమ్మును కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకునేందుకు కుట్ర పన్నుతుందని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయిస్తామని చెప్పి ఇప్పుడు ఫీజు వసూలు చేస్తానంటుందని ఆరోపించారు. ఉచితంగా ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్ఐ అరవింద్ తదితరులు

ఎస్ఐ అరవింద్

మోమిన్‌పేట: బాలికలు చట్టాలపై అవగాహన కల్గిండాలని ఎస్ఐ అరవింద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మేకవనంపల్లి ఉన్నత పాఠశాలలో చట్టాలు, ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అరవింద్ మాట్లాడుతూ.. మహిళలు, బాలికలకు చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. కళాశాల, పాఠశాలకు వెళ్లేటప్పుడు ఈవ్‌టీజింగ్ జరిగితే వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికలకు అండగా నిలుస్తున్నాయని వివరించారు. అలాగే బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని వైద్యాధికారిణి సుజల అన్నారు. ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గౌరిశంకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

లైసెన్స్ రద్దు చేస్తాం

సీఐ సంతోష్ కుమార్

తాండూరు టౌన్ : బైకుల సైలెన్సర్లు మార్చి శబ్ద కాలుష్యానికి పాల్పడితే డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తామని వాహనదారులను పట్టణ సీఐ సంతోష్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలో పలు బైకులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా శబ్ద కాలుష్యాన్ని కలిగిస్తున్న పలు బైకుల సైలెన్సర్లను తొలగించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. వాహనదారులు అధిక శబ్దం వచ్చేలా సైలెన్సర్లను మారిస్తే తొలిసారి రూ. వేయి జరిమానా, రెండోసారి రూ. 2వేలు, మూడోసారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.



బైకుల సైలెన్సర్లను తొలగించిన పోలీసులు

అవిశ్వాసంలో నెగ్గిన చైర్‌పర్సన్‌కు సన్మానం



అపర్ణను సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు: సదాశివపేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్‌పాటిల్‌ను తాండూరు మున్సిపల్ కౌన్సిలర్ వరాల శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. రెండు రోజుల క్రితం సదాశివపేట్ మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. కౌన్సిలర్‌గా అపర్ణశివరాజ్‌పాటిల్‌ను మెజార్టీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో ఫిఫ్టీ ఫిఫ్టీ ఒప్పందం ప్రకారం చైర్‌పర్సన్‌ల నియామకం జరిగింది. అయితే, గడువు ముగిసినా చైర్‌పర్సన్‌లు పదవిని వీడలేదు. దీంతో సదాశివపేట్ మున్సిపాలిటీలో కౌన్సిలర్‌లు అవిశ్వాసం పెట్టి చైర్‌పర్సన్ పదవి నుంచి తప్పించారు. దీంతో తాండూరు మున్సిపల్ కౌన్సిలర్ వరాల శ్రీనివాస్‌రెడ్డి చైర్‌పర్సన్‌ను కలిసి సన్మానించారు. తాండూరు మున్సిపాలిటీలో ఒప్పందం ప్రకారం చైర్‌పర్సన్ దిగిపోవాల్సి ఉంటుంది. కాని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి పదవిని కాపాడుకుంటున్నారని కౌన్సిలర్ విమర్శించారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ



అనంతగిరి: వికారాబాద్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రెడ్డి బుధవారం జిల్లా ఎస్పీ కోటిరెడ్డిని మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పూల బొకే అందజేశారు.

ఫోన్ అప్పగింత

తాండూరు టౌన్ : ఓ వ్యక్తి పోగొట్టుకున్న ఫోన్‌ను తాండూరు పట్టణ పోలీసులు తిరిగి అప్పగించారు. పట్టణ ఎస్సై కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం...గత నెల 22న తాండూరు నుంచి గాజీపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో జునుముల కిష్టప్ప తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఫోన్ పోయిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో బుధవారం ఫోన్‌ను కనిపెట్టి బాధితునికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లెతై పోలీసులకు ఫిర్యాదు చేయాలని, సాంకేతికత ఆధారంగా ఫోన్‌ను కనిపెట్టి అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కిష్టప్పకు ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

ప్రధానోపాధ్యాయుడు వెంకట్



అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకట్

దోమ : ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని బొంపల్లి పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దిర్సంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 'బాలిక సాధికారత' అనే అంశాలపై విద్యార్థులకు బాల్య వివాహాలు, బాలకార్మిక, సైబర్ నేరాలు, అగ్ని ప్రమాదాలు, పదవ తరగతి విద్యార్థుల ఒత్తిడిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి మహిళలపై జరుగుతున్న అసమానతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ రావు, పీహెచ్‌సీ సూపరింటెండెంట్ నిర్మల, పరిగి ఫైర్ సెఫ్టీ అధికారులు పాండురంగారావు, చంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు పక్కదారి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీఓ షేక్ సుష్మా

పెద్దేముల్: పెద్దేముల్ గ్రామ పంచాయతీ నిధులు పక్కదారి పట్టాయి. గ్రామాభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాల్సిన పంచాయతీ కార్యదర్శి భాస్కర్ రూ.2 లక్షల జీపీ సొమ్మును కంప్యూటర్ ఆపరేటర్ పేరున డ్రా చేశాడు. గ్రామ ప్రత్యేకాధికారి షేక్ సుష్మా పంచాయతీని సందర్శించి, కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేయగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవిస్తామని చెప్పారు. డబ్బులు కాజేసిన విషయం బయటకు పొక్కడంతో కార్యదర్శి సెలవుపై వెళ్లినట్లు తెలిసింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: పరిగి సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని ఏఈ ఖాజా బుధవారం ఒక ప్రటకనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పరిగి మున్సిపాలిటీ, సుల్తాన్‌పూర్, లక్ష్మీదేవిపల్లి, నస్కల్, బర్కత్‌పల్లి, రుకుంపల్లి, బసిరెడ్డిపల్లి, రంగాపూర్, నజీరాబాద్, న్యామత్‌నగర్, మాదారం, పేటమాదారం గ్రామాలతో పాటు పరిశ్రమలకు సరఫరా ఉండదన్నారు.